
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 మే 2023
4
తిరుపతి



శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి సిటి/టౌన్: తిరుపతిలో సోమవారం నుండి ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించడం జరుగుతుం దని విద్యార్థులు పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయ అధికారి సూర్యనారాయణ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం 40 రోజులపాటు మే 8, 2023 నుంచి జూన్ 11,2023 వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యా హ్నం 12గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని అందులో నిర్వహించే కార్యక్రమాల వివరాలు తెలిపారు. ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు కథలు వినడం, 8.30 నుండి 10 గంటల వరకు నచ్చిన పుస్తకాలు చదవడం వ్యయ లవ్ రీడింగ్ (పుస్తకపఠనాన్ని ప్రేమించడం) కార్యక్రమాలు నిర్వహించడం. 10 నుండి 10.10 గంటల వరకు విరామం. 10.10 నుండి 10.30 గంటల వరకు కథలు చెప్పడం, చెప్పిన, విన్న కథలపై విషయ విశ్లేషణ కార్యక్రమం ఉంటుంది. 10:30 నుండి 11 గంటల వరకు కథలు చెప్పడం. 11 నుండి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, పెయింటింగ్, తదితర పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఐదిక్లైతే పిల్లలు ఈవేసవి సెలవులో సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 90002 37312, 83176 51455 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వేసవి విజ్ఞాన శిబిరాల గోడపత్రిక విడుదల



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటి/టౌన్: ఈనెల 8 నుంచి 11 జూన్ 2023 వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జరుగబోవు వేసవి విజ్ఞాన శిబిరాల గోడపత్రికను, కరపత్రాలను తిరుపతి ఎంఎల్ఏ భూమన కరుణాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనార్ మధుబాలతో కలిసి విడుదల చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రతిఒక్క విద్యార్థి వినియోగించుకోవాలని, తల్లితండ్రులు తమ పిల్లల్ని ఈ శిబిరానికి పంపి వారు మంచి విజ్ఞానాన్ని సముపార్జించేందుకు సహాయపడాలని తెలియజేశారు. గ్రంథాలయ కార్యదర్శి లావణ్య, గ్రంథాలయ అధికారులు శివప్రసాద్, ధనంజయులు, గురుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణమే

ప్రజాశక్తి-తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణమే. వీకెండ్ కూడా రష్ పెద్దగా లేకపోవడంతో భక్తులు పెద్దఇబ్బంది పడకుండానే స్వామివారిని దర్శించుకుంటున్నారు. వర్షాలు, తుఫాను హెచ్చరికలతో భక్తులు తమ తిరుమల పర్యటనను రద్దు చేసుకున్నారని చెబుతున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని పది కంపార్ట్‌మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. నడక దారి వచ్చే భక్తులకు నాలుగు గంట సమయంలోనే శ్రీవారి దర్శనం పూర్తవుతుందని టిటిడి అధికారులు తెలిపారు. ఉదయం ఏడు గంటలకు సర్వదర్శనం క్యూలైన్‌లోకి టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు మాత్రం పన్నెండు గంటల పాటు శ్రీవారి దర్శన సమయం పట్టే అవకాశముందని తెలిపారు. అలాగే రూ.300ల శీఘ్రదర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం రెండు నుంచి మూడు గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. నిన్న తిరుమల శ్రీవారిని 76,392 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 36,248 మంది భక్తులు తమ తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.83కోట్ల రూపాయలు వచ్చిందని అధికారులు వెల్లడించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు రావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఘనంగా మేడే సంబరాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి: వేమన విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో మేడేని పురస్కరించుకుని సాంస్కృతోత్సవాల సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం కార్యదర్శి ఎం.నాగార్జున అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు సాంస్కృత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథులు రీచ్‌గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టరు రమేష్ నాథ్ లింగుట్ల, స్విమ్స్ అత్యవసర విభాగం సిఎంఓ డాక్టరు మునస్వామి మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి, వారిలోని ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అబినందనీయమని తెలిపారు. ఈసందర్భంగా పిల్లలు, యువత, పెద్దవారు అని తేడా లేకుండా అందరూ వివిధ రకాల సాంస్కృత కార్యక్రమాల ప్రదర్శనలు ఇచ్చారు. మిమిక్రీ, శాస్త్రీయ నృత్యాలు, జానపదనృత్యాలు, దేశభక్తి గీతాలాపనలు, నాటికలు, ఫోక్ డ్యాన్స్, ఇతరత ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన ప్రదర్శనలను ప్రజలు పెద్దఎత్తున హాజరై వీక్షించారు. సాంస్కృత ప్రదర్శనల అనంతరం మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో తిరుపతి బాలోత్సవం గౌరవధ్యక్షులు టెంకాయల దామోదరం, టిటిడి డివైఈవో ఏ.ఆనంద రాజు, ఎల్ఐసి యూనియన్ నాయకులు వై.కృష్ణకుమార, నడ్డినారాయణ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు హర్షనీయం



ప్రజాశక్తి-తిరుపతి సిటి: రాష్ట్ర రాజధాని అమరావతిలో దళితులకు భూములు ఇవ్వడంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షనీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి మల్లారపు మధు తెలిపారు. స్థానిక చెన్నారెడ్డి కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళి అర్పించిన ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అంబేద్కర్ భావజాలంతో మన రాష్ట్రాన్ని అభివద్ధి దిశలో పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ఇందుకు నిదర్శనం అమరావతి అవుట్ సైడర్ భూములు దళితులకు ఇవ్వడమే అని దీనిని తట్టుకోలేని ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు నాయుడు దీనికి వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ వేయడం శోచనీయమన్నారు. కానీ హైకోర్టు పరిశీలించి దళితులకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షనీయమన్నారు. దళితులకు వెన్నంటే ఉంటూ అభివద్ధి పథంలో నడిపిస్తున్న జగన్మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో దళితులు, గిరిజనులు, బహుజనులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పుష్కరిణి, కళ్యాణకట్టను ప్రారంభించిన టీటీడీ ఛైర్మన్

ప్రజాశక్తి- తిరుపతి సిటి: బెంగళూరు నగరంలోని వయ్యాలి కావల్‌లో గల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్మించిన స్వామివారి పుష్కరిణి, కల్యాణకట్టను ఆదివారం టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ రూ.7లక్షల వ్యయంతో ఇక్కడ పుష్కరిణి నిర్మించామని, తిరుమలకు రాలేని భక్తులు ఇక్కడ తలనీలాలు సమర్పించి, స్వామివారి పుష్కరిణలో స్నానం చేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరిణిని ప్రారంభించారు. అదేవిధంగా కల్యాణకట్ట, ప్రసాదాల విక్రయ కేంద్రం, టీటీడీ ఉత్పత్తుల విక్రయ కేంద్రం, టీటీడీ సేవాటికెట్ల కౌంటర్‌ను ఛైర్మన్ ప్రారంభించారు. ఇక్కడి టీటీడీ కళ్యాణ మండపంలో జరుగుతున్న శ్రీవెంకటేశ్వర భక్తి ఛానల్ స్టూడియో పనులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో బెంగళూరు స్థానిక సలహా మండలి అధ్యక్షులు సంపత్ రవి నారాయణన్, ఉపాధ్యక్షులు రాధాకష్ణ అడిగ, కార్యదర్శి భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐసర్‌లో కార్మికులచే వెట్టిచాకిరి

- కానరాని మౌలిక వసతులు
- పారిశుధ్యం మరింత అధ్వానం
- రోగాలబారిన భవన నిర్మాణ రంగం కార్మికులు
- ఒకరు మృతి
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- బాధితులను పరామర్శించిన సీఐటీయూ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:
తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలో నిర్మిస్తున్న ఐసర్ (ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)లో భవన నిర్మాణ రంగ వలస కార్మికులు అడుగడుగునా వివక్షకు గురవుతున్నారు. కనీస మౌలిక వసతులకు నోచుకోక దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ ఆ వలస కార్మికుల చేత వెట్టిచాకిరి చేయించుకుంటూ కనీసం వారి యోగక్షేమాలు పట్టించుకోని పరిస్థితి. దీంతో ఐసర్ నిర్మాణంలో భాగస్వాములైన సుమారు 1100మంది వలస కార్మికులు నిత్యం అనారోగ్యం భారిన పడుతూ సతమతమవుతున్నారు. ఈ క్రమంలో గత వారం రోజులుగా సుమారు 30మంది కార్మికులకు సుస్తి చేయడంతో కాంట్రాక్టరే ఎవరికి తెలియకుండా ప్రైవేటుగా వైద్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సుశీల్ కుమార్(33) అనే కార్మికుడు శనివారం తీవ్ర అనారోగ్యానికి గురికాగా, ఆయన్ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించడం గమనార్హం. వివరాల్లోకి పోతే...



మృతుడు సుశీల్ కుమార్

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్ద నిర్మిస్తున్న ఐసర్ లో మధ్యప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, బీహార్, చండీగర్ రాష్ట్రాలకు చెందిన సుమారు 1100 మంది భవన నిర్మాణంగా వలస కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా డిఇసి కంపెనీ పరిధిలో ఒప్పంద కార్మికులుగా ఐసర్ నిర్మాణాలను చేపడుతున్నారు. అయితే సదరు కంపెనీ వీరికి వసతి సదుపాయాలు కల్పించకపోవడంతో కార్మికులంతా రేకుల షెడ్లలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేకులషెడ్ల వద్ద కనీస మౌలిక వసతులు లేకపోవడంతో మలం, మూత్ర విసర్జన అక్కడే చేయాల్సి రావడం విచారకరం. కార్మికులు నివసించే చోట ఏమాత్రం



బాధితులను పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

పరిశుభ్రత లేకపోవడంతో నిత్యం వ్యాధులు భారినపడాల్సి వస్తోంది. ఈనేపథ్యంలోనే గత మూడు రోజులుగా 30మంది కార్మికులు తీవ్ర అశ్వస్థతకు ఆసుపత్రి పాలయ్యారు. శనివారం సునీల్ కుమార్ అనే కార్మికుడి పరిస్థితి విషమించడంతో ఆయన శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. అయితే ఐసర్ వద్ద కార్మికులకు ఏర్పాటు చేసిన నివాస ప్రాంతంలో కనీస మౌలిక వసతులు లేకున్నా, కార్మికులు తరచూ అనారోగ్యం పాలవుతున్నా సదరు కంపెనీ పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితులు తలెత్తాయని తెలుస్తోంది. కార్మికుల అశ్వస్థత విషయం వైద్యాధికారులు తెలియడంతో ఆదివారం కంటితుడుపు చర్యగా మెడికల్ క్యాంపు నిర్వహించి మమ అనిపించారు. అయితే ఐజర్ వద్ద పరిస్థితులు అదుపులోకి రాని పరిస్థితి. కొందరు తీవ్ర అనారోగ్యం భారినపడి ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లినా వారి ఆచూకీ తెలియడం లేదు. కొందరు తీవ్ర భయాందోళనలకులోనై కంపెనీ వారికి కూడా చెప్పకుండా బయటకు వెళ్లిపోయినట్లు సమాచారం. ఐజర్ వద్ద భవన నిర్మాణరంగా వలస కార్మికుల పట్ల ఇంత వివక్ష జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. కనీసం ఐసర్ వద్దా ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నారు వారి వివరాలు కూడా అధికారుల రికార్డుల్లో లేకపోవడం దురదష్టకరం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అయితే నిర్మాణంలో భాగస్వాములైన వలస కార్మికులకు సత్వరమే అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించి, నివాస ప్రాంతంలో కనీస మౌలిక వసతులు మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి: సిఐటియు

జంగాలపల్లి ఐసర్ వద్ద భవన నిర్మాణ రంగా వలస కార్మికుల కేటాయించిన నివాస ప్రాంతాన్ని ఆదివారం సిఐటియు నాయకులు పరిశీలించారు. అక్కడ కార్మికులకు కేటాయించిన రేకుల షెడ్లను, అపరిశుభ్ర పరిస్థితులను చూసి విస్తుపోయారు. కార్మికులకు కేటాయించిన నివాస ప్రాంతం పశువుల కొట్టం కంటే దారుణంగా ఉందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, రంగయ్య వాపోయారు. డీఈసీ కంపెనీ నిర్లక్ష్యం వల్లే సునీల్ కుమార్ అనే కార్మికుడు మతి చెందాడనీ, ఆయన కుటుంబానికి కంపెనీ రూ.25లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అనారోగ్యం పాలైన కార్మికుల వైద్య సదుపాయాలకయ్యే ఖర్చు మొత్తాన్ని కంపెనీ భరించాలని స్పష్టం చేశారు. వలస కార్మిక చట్టాలను అమలు చేసి కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఐసర్ వద్ద అత్యంత దారుణంగా ఉన్న కార్మికుల రేకుల షెడ్డు

రెండు రహదారులు ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి నగరం ఆధ్యాత్మికంగాను.. అభివద్ధి దిశగాను ముందుకెళుతోందని తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతి–రేణిగుంట రోడ్డులో ఆదివారం రెండు మాస్టర్ ప్లాన్ రోడ్లను కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ స్వామి చేతుల మీదుగా తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా, తిరుపతి ఎం.పి.మద్దెల గురుమూర్తి, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, ఎం.ఎల్.సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో.. ఆయన పూర్తి సహకారంతో తిరుపతిలో 14 కొత్త రహదారులను ఏర్పాటు చేశామని.. మహానుభావుల నామాలను నూతన రహదారులకు పెట్టాలని తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ నిర్ణయించడం అభినందించదగ్గ విషయమన్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయానికి భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని బహుకరించి, బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టిన పల్లవరాణి సామవాయి పేరుతో ఓ రహదారికి ఇటీవలే నామకరణం చేయడం జరిగిందన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ స్వామి వారు మాట్లాడుతూ తిరుపతి నగరంలోని రహదారులకు మహానుభావుల పేర్లను పెట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు. తమ గురువులైన పూర్వ కంచి కామకోటి పీఠాధిపతులైన చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి పేరుతో ఏర్పాటు చేసిన రహదారిని తాను ప్రారంభించడం అదష్టమని, ఈ అవకాశాన్ని తనకు కల్పించిన భూమనకు ప్రత్యేక అభినందనలన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ రూ.640 లక్షలతో పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ మార్గాన్ని, అలాగే రూ.285 లక్షలతో తొండమాన్ చక్రవర్తి మార్గాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని కొత్త రహదారులు తీసుకురావడం జరుగుతుందన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ ఏ ఊరైన అభివద్ధి చెందాలంటే సరైన రహదారులు ఉండాలనే లక్ష్యంతో తామంతా పనిచేస్తు నూతన మాస్టర్ ప్లాన్ రోడ్లను ప్రజాభివద్ధికై తీసుకొస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ డివిజన్ కార్పొరేటర్ ఉమాఅజయ్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, నరసింహాచారి, కార్పొరేటర్లు అమరనాధ్ రెడ్డి, నరేంద్ర, ఆంజినేయులు, శేఖర్ రెడ్డి, హనుమంత్ నాయక్, మోహన్ కష్ణ, తిరుత్తణి శైలజ, దూదికుమారి, కోటేశ్వరమ్మ, ఆదిలక్ష్మి, కో.ఆప్షన్ సభ్యులు ఇమామ్ షాహేబ్, రుద్రరాజు శ్రీదేవి, అదనపు కమిషనర్ సునీత, ఎస్.ఈ మోహన్, డిసి చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎం.ఈ వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ, డిఈ విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.




ఈస్ట్ ఎస్ఐ శ్రీనివాసులను తక్షణమే సస్పెండ్ చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్

ప్రజాశక్తి-తిరుపతి సిటి: తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న శ్రీనివాసులు, కానిస్టేబుళ్లను తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం తిరుపతి గాంధీ విగ్రహం సెంటర్లో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోలీసుల తీరును నిరసిస్తూ నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకష్ణ మాట్లాడుతూ శనివారం ఉదయం ఆటోడ్రైవర్ మధును కొంతమంది టాక్సీ డ్రైవర్లు అన్యాయంగా కొట్టి గాయపరిచిన విషయంపై శనివారం తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. శనివారం ఉదయం ఎస్సై శ్రీనివాసులు ఫిర్యాదుదారునికి ఫోన్‌చేసి మీ కేసును ఎఫ్ఐఆర్ చేశాం, తీసుకోమని చెప్పారు. దీంతో మధు తమ్ముడు రాజశేఖర్ పోలీస్‌స్టేషన్ కెళ్ళి ఎఫ్ఐఆర్ తీసుకున్నారు. అందులో బలమైన సెక్షన్స్ లేవని ఎస్ఐ శ్రీనివాసులను అడగడంతో కోపోద్రుగ్దుడైన ఎస్ఐ రాజశేఖర్‌ను కొట్టి, స్టేషన్ లోపలికి తీసుకెళ్లి మరో ఏడు మంది కానిస్టేబుళ్లతో బెల్టు తీసుకొని తీవ్రంగా కొట్టారు. రాజశేఖర్ చెవికి పడింది. న్యాయం అడిగిన పాపానికి ఒక డ్రైవర్ను ఈ విధంగా కొట్టడం ఏ చట్టం కింద వస్తుందో సంబంధిత పోలీసులే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల్ని రక్షించడానికి పోలీస్‌స్టేషన్లో పోలీసులు ఉండాలే గాని ఫిర్యాదుదారులను కొట్టడం ఏంటని వారు ప్రశ్నించారు. ఈస్ట్ పోలీస్‌స్టేషను అన్యాయాలకు అక్రమాలకు నిలయంగా మారిపోతున్నదని, ఈ పోలీస్‌స్టేషన్ పైన ఎస్పీ ప్రత్యేక దష్టి కేంద్రీకరించి తగుచర్యలు తీసుకోవాలన్నారు. రాజశేఖర్‌ను అన్యాయంగా కొట్టిన ఎస్సై శ్రీనివాసులను అందుకు సహకరించిన కానిస్టేబుల్‌లను తక్షణమే సస్పెండ్ చేసి, రాజశేఖర్‌కు న్యాయం చేయాలని డిమాండు చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, ఎన్.శ్రీరాములు, కెవై రాజా, ఎన్.శివ, వెంకటేశ్, ఎపి.బాల, సూరి, కష్ణ, సతీష్, శంకర్, బాల, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య గొప్ప సామాజికవేత్త : భూమన

ప్రజాశక్తి-తిరుపతి సిటి: భగవంతుని దష్టిలో మనుషులందరూ సమానమేనని తన సంకీర్తనల ద్వారా చాటి చెప్పిన తాళ్లపాక అన్నమయ్య గొప్ప సామాజికవేత్త అని శ్వేత మాజీ సంచాలకులు భూమన సుబ్రహ్మణ్యంరెడ్డి (భూమన్) చెప్పారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంతి ఉత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సు కు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ 600 సంవత్సరాల క్రితం అప్పటి సామాజిక పరిస్థితులకు వ్యతిరేకంగా అన్నమయ్య గళం విప్పారని చెప్పారు. పలు సంకీర్తనల్లో ఆనాటి గ్రామీణ పరిస్థితులు, పాడి పంటలు, సాగునీరు, కుటుంబ సంబంధాలు తదితర అంశాలను తెలియజేశారని అన్నారు. మహిళలకు సమాన అవకాశాలు ఉండాలని నొక్కి చెప్పారని తెలిపారు. అత్యంత సంస్కారవంతంగా శంగార సంకీర్తనలు రచించి భక్తి భావాన్ని వ్యాప్తి చేశారని తెలియజేశారు. తాను శ్వేత డైరెక్టర్‌గా పనిచేసిన కాలంలో అన్నమయ్య స్ఫూర్తితోనే శ్వేతలో గిరిజన, దళిత, మత్స్యకార ఇతర వెనుకబడిన వర్గాల వారికి అర్చక శిక్షణ ప్రారంభించా మని గుర్తు చేశారు. అన్ని మతాలవారు శ్రీవేంకటేశ్వర స్వామివారిని కొలిచారని తెలిపారు. అన్య మతాలకు చెందిన ప్రభువులు, రాజులు తిరుమల సందర్శించినప్పుడు స్వామివారికి సమర్పించిన కానుకలను తిరుమల కొండ పై ఇప్పటికీ చూడవచ్చన్నారు. అనంతరం బెంగళూరు కు చెందిన ఆచార్య జిఎస్ మోహన్ అన్నమయ్య – పురందరదాసులు అనే అంశంపై ఉపన్యసించారు. ఇద్దరి సంకీర్తనలు జానపద శైలిలో, సామాన్య ప్రజలకు అర్థ మయ్యేలా ఉంటాయని తెలియజేశారు. విజయవాడకు చెందిన డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నమయ్య–దివ్య ప్రబంధ ములు అనే అంశంపై ఉపన్యసించారు. అళ్వార్లు దివ్య ప్రబంధంలో అందించిన అంశాలన్నింటినీ అన్నమయ్య తన సంకీర్తనల్లో ప్రతిబింబించారని వివరించారు. తిరుపతికి చెందిన జి.నాగేశ్వర నాయుడు బందం సంగీ త సభ, జ్యోత్స్న బందం హరికథా గానం చేశారు. కార్య క్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, తుడ కార్యదర్శి లక్ష్మి ఇతర అధికా రులు, కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.



వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా అగ్నిమాపక శాఖాధికారి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- తిరుపతి సిటి :
ముందే వేసవి, ఎండ తీవ్రంగా ఉంటోంది. పగటిపూట బయట తిరగాలంటే ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి. ఇలాంటి తరుణంలో ఎలక్ట్రికల్ వస్తువులు, గడ్డివాములు, ఇతరాత్ర వాటి వద్ద అగ్ని ప్రమాదులు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి జె.రమణయ్య తెలిపారు. వేసవి సందర్భంగా తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజలందరూ అప్రమత్తగా ఉండాలన్నారు. తిరుపతి అగ్నిమాపక కేంద్రంలో ప్రమాదకర పరిస్థితులు సంభవించినప్పుడు ఎదుర్కొనేందుకు అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచామన్నారు. తిరుపతి కార్యాయలంలో మూడు భారీ అగ్నిమాపక వాహనాలు ఉన్నాయన్నారు. ఇటీవలే 20కోట్ల రూపాయలతో స్కయ్‌లిఫ్ట్ వాహనాన్ని తిరుపతికి కేటాయించారన్నారు. ఇది 4మీటర్ల ఎత్తు వరకు ప్రమాదాల సమయంలో మంటలు ఆర్పేందుకు ప్రత్యేకంగా తయారు చేయించిన యంత్రం. దీన్ని రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాలకు



మాత్రమే కేటాయించారు విజయవాడ, విశాఖపట్టణం తర్వాత అలాంటి వాహనం ఉన్న ఏకైక ప్రాంతం తిరుపతి మాత్రమే అన్నారు. ఇది రావడంతో ఎంతటి భారీ ప్రమాదాలైన ఎదుర్కొవచ్చు అని తెలిపారు.

తిరుపతి పెద్దనగరం, రోజు రోజుకు విస్తరిస్తోందని, ఇక్కడ చాలా వరకు ఇరుకు సందులు ఉన్నాయని, ప్రమాదాలు సంభవించినప్పుడు వాహనాలు వెళ్లేందుకు కూడా స్థలం సరిపోదని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 30లక్షల వ్యయంతో చిన్న వాహనాలను కొనుగోలు చేసి, తిరుపతికి కేటాయించారని ఇది ఆటో వెళ్లగలిగే సంధుల్లో సైతం వెళ్లగలిగేలా తయారు చేశారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని అగ్నిమాపకశాఖ కార్యాలయాల్లో వాహనాలను ఎప్పటికిప్పడు పరిశీలిస్తూ, వాటిని కండీషన్‌లో ఉంచుకునేలా చేసి, అత్యవసర పరిస్థితుల్లో నీటి కొరత లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే ఎంపిక చేసుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు.

తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్న వాహనాలు సామర్థ్యం చాలాకపోతే రేణిగుంట విమానశ్రయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మరో రెండు అగ్నిమాపకశాఖ వాహనాలను వినియోగించుకుని ప్రమాదాలను ఎదుర్కొంటున్నామన్నారు. అగ్నిమాపకశాఖలో పనిచేసే సిబ్బంది సైతం నిత్యం వివిధ స్కూల్స్, కళాశాలు, యూనివర్శిటీలు, పరిశ్రమలు, పెద్ద కార్యాలయాలు, ఆసుపత్రుల్లో మాక్‌డ్రిల్ నిర్వహించి, ప్రజలను అప్రమత్తం చేస్తూ, వారికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, ఎద్దైన ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే తమకు సమాచారం అందిస్తే, సమాచారం అందిన వీలైనంత తక్కువ సమయంలో అక్కడికి చేరుకుని, ప్రమాదాన్ని అదుపు చేస్తామని వివరించారు.

డాక్టర్ సి.ఆర్.రెడ్డి సేవలు మరువలేనివి



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని షిరిడి సాయి బాబా మందిరం నిర్మాణ ప్రదాత డాక్టర్ సీఆర్ రెడ్డి సంతాప సభ బాబా మందిరంలో ఆదివారం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిటీ సభ్యులు సీఆర్ రెడ్డి కుమార్తె డాక్టర్ రోహిణి , అల్లుడు జనార్దన్ రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయన స్ఫూర్తితో సమాజంలో పేదలకు తమ వంతు సహాయం అందిస్తామని తెలిపారు. సీనియర్ ఆడిటర్ రామ్మోహన్ రావు, పి.వి.కృష్ణయ్య, కోటి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యసేవలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: టాటా ట్రస్టు సహకారంతో వనమాలపేట హైస్కూల్‌లో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించారు. నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర ఆసుపత్రి వైద్యులు పేదలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన టాటా ట్రస్ట్ అధికారులకు ఎంతో కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు, పార్టీ అధ్యక్షులు జానా వెంకటయ్య, ధనంజయనాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ప్రారంభం



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ఎల్లమంద పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎల్‌వీ ఫిల్లింగ్ స్టేషన్ (ఇండియన్ ఆయిల్)ను ఆదివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. యజమాని ఎం.లక్ష్మీపతి నాయుడు, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు రెడ్డెప్ప, మండల వైసీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సరుకుల పంపిణీ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిద్ధారెడ్డి జనార్దన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆదివారం 20 మంది దివ్యాంగులకు సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ సిద్ధారెడ్డి, సుధీర్‌రెడ్డి ఫల సరుకులు పంపిణీ చేశారు. డాక్టర్ ఎం.సాయి శరత్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంకరెడ్డి, అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కష్ణారెడ్డి, రామకష్ణారెడ్డి, రాఘవరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి , ధనుంజయరెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, జైపాల్‌రెడ్డి, కష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరులోని కుమ్మరవీధిలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధ్యక్షులు వెంకట శేషయ్య, రావూరు బ్రహ్మయ్య, గురుబ్రహ్మ, రవికుమార్, ఆదినారాయణ, చెంచయ్య, మురుగేష్, శీనయ్య, శ్రీహరి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గమళ్లపాలెం ప్రాంతంలోని ఓం శ్రీసాయి రాం వృద్ధాశ్రమంలో గురువారం మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్యామ్ యాదవ్ సతీమణి మహేశ్వరి, వసతి గృహ నిర్వాహకులు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు సహకరించాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వార్షిక బ్రహ్మోత్సవాలకు కమిటీ పూర్తిగా సహకరించాలని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ రమేష్‌బాబు కోరారు. ఆదివారం ఆయన వార్షిక బ్రహ్మోత్సవాలపై ఉభయదారులందరితో సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరిపేందుకు ధర్మకర్తలు, ఆలయ అర్చకులు, కార్య నిర్వహణ అధికారికి వారి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఉభయదారులు కోరిక మేరకు కొద్ది రోజుల క్రితం గుడి చుట్టూ ఉన్న స్థలాన్ని స్వాధీన పరుచుకున్నారన్నారు. ఊరేగింపు కార్యక్రమం గుడి చుట్టూ మొదలై తరువాత ఊరేగింపుగా తిరగాలని కోరారు. కార్యక్రమంలో ఛైర్మన్, ధర్మకర్తలు, ఆలయ అర్చకులు, ఉత్సవ కర్తలు, భక్తులు పాల్గొన్నారు.

'పది'లమైన ఫలితాలు..!



పదిలో వేదవ్యాస విద్యానికేతన్ ప్రతిభ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పదో తరగతిలో పుత్తూరులోని వేదవ్యాస విద్యానికేతన్ 97 శాతం ఫలితాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ వేదవ్యాస్ బాల సరస్వతి తెలిపారు. విద్యార్థిని కీర్తి 584, షర్మిల 578 , భువన సాయి 578, దేవేష్ 578 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

విజయ స్కూల్ టాపర్‌గా శివకుమార్



పాకాల: మండలంలో దామ లచెరువు విజయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ టాపర్గా శివకుమార్ నిలిచారని పాఠశాల హెడ్మాస్టర్ మాధవి తెలిపారు. విజయ స్కూల్ విద్యార్థులు 96.4 శాతం ఉత్తీర్ణులయ్యారని అన్నారు. శివ కుమార్ 576 మార్కుల తో మొదటి స్థానం లో నిలువగా, శిఫాన 574 మార్కుల తో రెండవ స్థానం, జాస్మిత 573 మార్కులతో మూడవ స్థానం లో నిలిచారని తెలిపారు.

ఇన్నెంట్ జీసస్ విద్యార్థుల ప్రతిభ



పాకాల: స్థానిక ఇన్నెంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాలలో మండలంలోనే మొదటి స్థానంలో నిలిచారని పాఠశాల కరస్పాండెంట్ ఆంటోనీ రాజ్ తెలిపారు. పాఠశాల టాపర్‌గా ప్రణయ్ 587 మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చారన్నారు. 49 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 96 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

జోషన్ కృష్ణ సత్తా



తిరుపతి(మంగళం): పదో తరగతి పరీక్షా ఫలితాలలో ఎంఆర్ పల్లిలోని కేశవరెడ్డి పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న కె.జోషన్ కృష్ణ 590 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో పాఠశాల ఖ్యాతిని పెంచారని విద్యా సంస్థల నిర్వాహకులు తెలిపారు. ఇంతటి ఉత్తమ ప్రతిభ కనబరచాడడానికి తగిన తర్ఫీదును అందించిన ఉపాధ్యాయులకు జోసన్ కష్ణ తండ్రి మురళి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్‌వీ చిల్డ్రన్స్ విద్యార్థుల ప్రతిభ



తిరుపతి సిటీ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీవెంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ విద్యార్థుల అత్యుత్తమ మార్కులతో ప్రతిభ చాటారని ఆ స్కూల్ అధినేత కెఎస్.వాసు, హెచ్ఎం స్వప్నలత తెలిపారు. స్థానిక భవానినగర్‌లోని ఆ స్కూల్ ప్రాంగణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ తమ స్కూల్ నుంచి 329 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైతే 307 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తర్ణత సాదించారని, 174 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారన్నారు. డి.శ్రీవైష్ణవి 593, కె.మంజునాథ్ మహర్ష 592, జి.యశ్వని 588, సి.నవదీప్ 587, పి.షణ్ముకేశ్వర 585 మార్కులతో స్కూల్ టాపర్లుగా నిలిచారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

సుధహా విద్యార్థుల విజయకేతనం

తిరుపతి సిటీ: పదో తరగతి పరీక్షల్లో సుధహా లిటిల్ సిటిజన్స్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో విజయకేతనం ఎగురవేశారని ఆ స్కూల్ కరస్పాండెంట్ డాక్టరు కోడూరు బాలసుబ్రమణ్యం, డైరెక్టరు జె.రాజేంద్రప్రసాద్ రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌సి రోడ్డులోని శ్రీ నగర్ కాలనీలోని ఆ స్కూల్ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ఎ.లక్ష్మీప్రసాద్ 551, ఓ.జ్యోతిప్రశాంత్ 548, ఎన్.నిఖిల 545, బి.తరుణ్ 544, పి.లక్ష్మీదీపక్ 536, జి.నందిని 529, సి.నవీన 523, పి.నిఫ్మేష్ 522 మార్కులతో స్కూల్ టాపర్లగా నిలిచారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

నెల్లటూరు హైస్కూల్ టాపర్‌గా వెంకట్ అనిల్

గూడూరు టౌన్: గూడూరు పురపాలక సంఘ పరిధిలోని నెల్లటూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి వెంకట్ అనిల్ కుమార్ పదో తరగతిలో 521 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచాడు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. గురు సాయి 455, గౌతమి 443 మార్కులతో పాస్ అయినట్లు ఆయన తెలిపారు.

పది ఫలితాల్లో రత్నం స్కూల్ ప్రభంజనం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీరామనగర్ కాలనీ లోని డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ 2022బి23 విద్యా సంవత్సర పది పరీక్షా ఫలితాల్లో విజయ దుందుభి మోగించారు. ఈ పరీక్షా ఫలితాల్లో 600 మార్కులు కు గాను అత్యధికంగా 580 మార్కులు సాధించి సత్య సాయి శ్రీ వాస్తవ్ స్కూల్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. రెండో స్థానంలో కె.యశ్వంతి 578 ,మూడో స్థానంలో యం.వెంకటాద్రి 577 మార్కులు సాధించారు. అత్యధికంగా 570 కి పైగా ఏడు మంది విద్యార్థులు, 560 కి పైగా 11 మంది విద్యార్థులు, 550 పైగా 14 మంది, 500 కి పైగా 27 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలలోని విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత పొందారు. విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్స్ డాక్టర్ కృష్ణ కిషోర్, వసంతి కిషోర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య అద్భుత విజయం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మిత్రప్రియ 592, జోహి లాస్య 591, కె.టీనారాణి 589 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాళ్లు శరవణ, రవికిరణ్, సుధారాణి తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఆదివారం విద్యార్థులను ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు, జోనల్ కోఆర్డినేటర్ బాలాజీ, ప్రిన్సిపాళ్లు, డీన్ తిరు, మోహన్, పార్థసారథి విద్యార్థులను అభినందించారు.

డీఎస్టీ మహిళా శాస్త్రవేత్త అవార్డుకు శ్వేతకుమారి ఎంపిక



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఎస్ఎస్ఐఈ టెక్నాలజీ బిజినెస్ ఇంకుబేషన్ మేనేజర్‌గా పని చేస్తున్న డాక్టర్ కే. శ్వేతాకుమారి న్యూ ఢిల్లీలోని డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా ప్రతిష్టాత్మకమైన మహిళా శాస్త్రవేత్త అవార్డు ప్రాజెక్టుతో ఎంపికైనట్లు బయో సైన్స్ సెరికల్చర్ విభాగపు సీనియర్ ఆచార్యులు డిఎం మమత వెల్లడించారు. డాక్టర్ కే. శ్వేత కుమారి కడప జిల్లాకు చెందిన స్వర్ణలత, హరినాథ్ దంపతుల కుమార్తె. ఈమె బిఎస్సి బయోటెక్నాలజీ తిరుపతిలోని సి కామ్ డిగ్రీ కళాశాలలో, ఎంఎస్సీ బయో ఇన్ఫర్మేటిక్స్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో, ఎంఎస్సీ బయోటెక్నాలజీ గీతం విశ్వవిద్యాలయం విశాఖపట్నం లో పూర్తి చేశారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మాజీ రిజిస్ట్రార్ ఆచార్య డిఎం మమతా పర్యవేక్షణలో పీహెచ్డీ ని పూర్తిచేసి, ప్రస్తుతం ఎస్ఎస్ఐఈ టిబిఐ ఇంకుబేషన్ సెంటర్ మేనేజర్ గా పనిచేస్తున్నారు. " స్టడీస్ టు ఎక్స్ప్లోర్ ది మెకానిజం ఆఫ్ ప్లాంట్ హెర్బివర్ ఇంటరాక్షన్స్ ఆల్టర్డ్ బై పారాసోడిస్ అండ్ పోలిడనవైరస్ " అనే అంశంపై ఈమెకు ప్రాజెక్టు మంజూరు అయింది ఇందులో భాగంగా ఆమె బయో సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ప్రాజెక్టును పూర్తి చేయనుంది. ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత కుమారి మాట్లాడుతూ తాను పరిశోధనా రంగంలో నిరంతరం కృషి చేయడంలో తన సహచర భాగస్వామి డాక్టర్ రాజు పాత్ర ఎంతో కీలకమైంది అన్నారు. తనకు పరిశోధనలలో సహకరించిన వర్సిటీ అధ్యాపకులకు, బోధన, బోధనేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్వేతా కుమారిని వర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.రాజారెడ్డి, కుల సచివులు ఆచార్య రజిని, మాజీ కులసచివులు ఆచార్య డిఎం మమత, బయో సైన్సెస్ అధ్యాపకులు, టీబీఐ అధికారులు అభినందనలు తెలిపారు.

నాట్య, సంగీతం ప్రాచీన సంప్రదాయాలకు ప్రతిరూపాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : నాట్య, సంగీతం ప్రాచీన సంప్రదాయాలకు ప్రతిరూపాలు అని భరతనాట్య విభాగాధిపతి డా. హిమబిందు పేర్కొన్నారు. శ్రీ సాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శిల్పారామం వేదికగా నిర్వహించిన భారతీయ సంగీతం నత్యోత్సవాలు సాయంత్రం అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. హైదరాబాద్ , కేరళ, ఆంధ్రప్రదేశ్ కు చెందిన అనేక బందాలు చేసిన భరతనాట్యం ,మోహిని అట్టం కూచిపూడి, జానపద నత్యం లతో ఆద్యాంతం ప్రేక్షకులను విశేషంగా అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ భరతనాట్య విభాగాధిపతి డా.హిమబిందు, శిల్పారామం ఏ. ఓ ఖాదరవలి, విశ్వం స్కూల్స్ అధినేత విశ్వనాథ రెడ్డి, శ్రీ సాయి నటరాజ అకాడమీ డైరెక్టర్ శరత్ చంద్ర 80 మంది నాట్య కళాకారులకు నాట్య ప్రభ అవార్డుతో, గురులకు గురు శ్రేష్ఠ అవార్డుతో సత్కరించారు.

ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలి



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేదల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నగొట్టిగల్లు మండలం తిప్పారెడ్డిగారి పల్లి పంచాయతీ పరిధిలో గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మహా పాదయాత్రకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి రాకతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా జేజేలు పలుకుతూ ఘనంగా స్వాగతం పలికారు. మోహిత్ రెడ్డితో కలిసి గడప గడపకు పర్యటించారు. ప్రతి గడపలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సమర్థ పాలనకు, అభివృద్ధికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్ రెడ్డి, డీసీఎంఎస్ సహదేవ్ రెడ్డి, జెడ్పీటీసీ స్వరూపా మహేంద్ర రెడ్డి, పార్టీ డివిజనల్ అధ్యక్షులు ఉమా మహేశ్వర రెడ్డి, సర్పంచ్ మునిరామ్, ఉప సర్పంచ్ శివా రెడ్డి, ఎంపీటీసీ దాము, పంచాయతీ కన్వీనర్ కొండా రెడ్డి, రఘునాథ రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

50వ రోజుకు చేరిన వినుత పర్యటన



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్చార్జి కోటా వినుత ప్రారంభించిన 'నేను నా నియోజకవర్గ ప్రజలు' కార్యక్రమం 50 రోజులకు చేరుకుందని ఆదివారం పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ప్రకటించారు. కాలనీ వాసులను నేరుగా కలిసి స్థానిక సమస్యలను ఆరా తీశారు. వీధి దీపాలు, సరైన రోడ్డు లేక అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆమె ఎదుట వాపోయారు. మూడేళ్లలోని 30 ఏళ్ల అభివృద్ధి చేశానంటూ గొప్పలు చెప్పు కుంటున్న స్థానిక ఎమ్మెల్యే శ్రీరామ్ నగర్ కాలనీని ఎందుకు పట్టించుకోలేదని విమర్శించారు. కిరణ్ కుమార్, బాలాజీ, నితీష్ కుమార్, సురేంద్ర , తులసీ రామ్, ఉదయ్, ముని పాల్గొన్నారు.

మన్యం వీరుడికి ఘన నివాళులు





ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మన్యం వీరుడు అల్లూరు సీతారామరాజు 99వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక తిరుపతి రోడ్డులోని ఆయన విగ్రహానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రిటిష్ వారిని ఎదిరించి మన ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఏ హరి, వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీలు ముస్వామిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: తెల్ల దొరల నుంచి దేశాన్ని కాపాడేందుకు అల్లూరి సీతారామరాజు ప్రాణాలను అర్పిస్తే నేడు నల్ల దొరల నుంచి ప్రజలని కాపాడేం దుకు పవన్ కళ్యాణ్ శ్రమిస్తున్నారని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డా.పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజుకు నివాళులు అర్పించారు. గౌరవ అధ్యక్షులు కృష్ణయ్య, జిల్లా ఆనంద్, బాటసారి, తిరుపతి నాయకులు, లక్ష్మి, కిరణ్ కుమార్, రవి, శిరీషా, దివ్య, పురుషోత్తం, మోహిత్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష

ప్రజాశక్తి-తడ: పులివేంద్ర గ్రామం లోని పద్మావతి స్కూల్‌లో ఆదివారం నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 168 మంది విద్యార్థులు హాజ రవ్వాల్సి ఉండగా 166 మంది విద్యార్థులు హాజరయ్యారు. డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి పరీక్షా కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

పిడుగుపడి రైతు మృతి



ప్రజాశక్తి-కేవీబీపురం: కోటమంగాపురం గ్రామానికి చెందిన దాము(54) శనివారం పిడుగుపాటుకు మృతిచెందాడు. భర్త రాత్రి ఇంటికి రాకపోవడంతో భార్య శాంతి గ్రామస్థుల సాయంతో వెతకడంతో పొలం వద్దకు వెళ్లి పిడుగుపాటుకు మృతిచెంది ఉండటాన్ని గుర్తించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గ్రామానికి చేరుకొని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. మతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

కల్లు గీస్తూ జారిపడి కార్మికుడి...

ప్రజాశక్తి-గూడూరు రూరల్: మేఘనూరు గ్రామంలో తాటికల్లు గీస్తూ ప్రమాదవశాత్తు జారిపడి గీత కార్మికుడు మతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. శనివారం సాయంత్రం జడపల్లి రమణయ్య తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. అధికారులు స్పందించి ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

గులికలు తిని అక్కాచెల్లెళ్లు ఆత్మహత్యాయత్నం

- ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-నాయుడుపేట: తిమ్మాజికండ్రిగ సమీపంలోని స్వర్ణముఖి నది వద్ద వరుసకు అక్కాచెల్లెళ్లు ఇద్దరు కూల్‌డ్రింక్‌లో గులికలు కలుపుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఓ యువతి మృతిచెందగా మరో యువతి పరిస్థితి విషమంగా ఉంది. ఓజిలి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన వీరిద్దరూ అక్కాచెల్లెళ్లు. ముమ్మడి సుబ్బయ్య రెండో కుమార్తె రజిత(20), సురేష్ రెండో కుమార్తె యామిని(20) స్కూటీ నేర్చుకునేందుకు వెళుతున్నామని ఇంట్లో చెప్పి నాయుడుపేటకు వచ్చారు. స్వర్ణముఖి నది వద్ద వారివెంట తెచ్చుకున్న గులికలను కూల్‌డ్రింక్‌లో కలిపి తాగారు. గులికల మందు తాగినట్లు యామిని తండ్రి సురేష్‌కు ఫోన్‌లో సమాచారం అందించడంతో 108కు సమాచారం అందించి కుటుంబ సభ్యులతో సంఘటనా స్థలానికి చేరుకుని వారిని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రజిత ఆసుపత్రి వద్ద చికిత్స పొందుతూ మృతిచెందింది. యామిని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు నాయుడుపేట ఆసుపత్రి వద్దకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు



ప్రజాశక్తి-చంద్రగిరి: చంద్రగిరిలో గంజాయి స్వాధీనం చేసుకొని ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చంద్రగిరి మండలం శానంభట్ల సమీపంలోని ఓ కల్యాణ మండపం పక్కన ఏడుగురు యువకులు గుంపుగా ఉండటంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. వారు పారిపోవడానికి ప్రయత్నించగా అందులో ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లాకు చెందిన చెందిన సంజయ్ రెడ్డి, అన్నమయ్య జిల్లాకు చెందిన దొరబాబు రెడ్డి, షేక్ యునాష్, సత్య, చెన్నైకి చెందిన సతీష్, తిరుపతి రూరల్ మండలం తిరుమలపల్లికి చెందిన సంపత్ లను అరెస్ట్ చేశారు . వీరి నుంచి 2.3 కేజీల గంజాయి ప్యాకెట్లను, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొన్నారు. వీరితోపాటు నెల్లూరు, తిరుపతికి చెందిన రియాజ్, శ్యాముల్ అనే వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని చంద్రగిరి పోలీసులు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, తల్లిదండ్రులు బిడ్డలపై నిఘా ఉంచాలని సీఐ ఓబులేసు, ఎస్ఐలు వంశీధర్, హిమబిందు తెలిపారు.

ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం 1998–2003 కాలంలో విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు శంకర్‌నాయుడు వారి ఉపాధ్యాయ బృందం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పుత్తూరు ఎంఈవో తిరుమల రాజు, విశ్రాంత ఎంఈవో యుగంధర్ రాజు, కేశవుల రెడ్డి పాల్గొన్నారు. వత్తిపై అంకితభావం, ఆరోగ్యంపై జాగ్రత్తలు ఆదర్శ జీవితానికి పునాది అని తెలిపారు. విద్యార్థులు, పాఠశాల ప్రగతికి శంకర్ నాయుడు చేసిన సేవలను ఉపాధ్యాయులు చేసిన సేవలను ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హరిత, మనోహరి, పుష్ప, హేమలత, మీరా తదితరులు పాల్గొన్నారు.